క్లుప్తంగా

రేపటి నుంచి శత సహస్ర మోదక పూజ



విజయవాడ కల్చరల్: శృంగేరి జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి స్వామి ఆదేశంతో శివరామ కృష్ణ క్షేత్రంలో 5వ తేదీ గురువారం నుంచి 29వ తేదీ ఆదివారం 25 రోజులపాటు శత సహస్ర(లక్ష) మోదక లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ధర్మాధి కారి శిష్ట్యా హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సర్వవిఘ్న నాయకుడిని పూజించడం వల్ల సకల ఐశ్వర్యాలు కలుగుతాయని వివరించారు. జగద్గురువుల ఆది శంకరులు ప్రతిపాదించిన పంచాయ తన విధానంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ గణపతి పూజ, గణపతి అధర్వ శీర్షోపనిషత్ పారాయణ, ప్రదోష వేళల్లో సహస్ర నామార్చన, కార్యక్రమాలుంటాయని తెలిపారు. పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

ముగిసిన సంగీతోత్సవాలు



విజయవాడ కల్చరల్: లయనాద కళా స్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వేంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా వారం రోజులుగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వార్షిక సంగీతోత్సవాలు మంగళవారం ఉదయం ముగిశాయి. శాస్త్రీయ సంగీతానికి పెద్ద పీట వేస్తూ విద్వాంసులు నిర్వహించిన కచేరీలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. వీవీ రాఘురామ ప్రణద, ఆర్. వైష్ణవి, పేరవలి జయతి, పేరవలి మహతి వాగ్గేయకారుల కృతులను ఆలపించారు. చివరిగా కె. తుషార పూర్ణవల్లి నిర్వహించిన కచేరీ ఆకట్టుకుంది. వయోలిన్‌పై కె. సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై ఎం. కృష్ణ సాయి సహకరించారు.

బాధితులకు కొత్త కష్టాలు

విజయవాడస్పోర్ట్స్: ఎగువనున్న కొండ ప్రాంతాల నుంచి బుడమేరు వరదలో కొట్టుకొచ్చిన జలగలు, పాములు, కొండ చిలువలు ముంపు బాధితులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. విజయవాడ నగరంలోని పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని 20 కాలనీల్లోని ఇళ్లు వరద నీటితో నిండిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ఒక్కొక్కరుగా వారివారి ఇళ్లను చూసుకునేందు వెళ్లి కంగుతింటున్నారు. నివాస ప్రాంతాల్లో వరద ప్రభావంతో చెల్లాచెదురుగా పడి ఉన్న సమాన్ల మాటున విషసర్పాలు, కొండ చిలువలు తిష్టవేసి స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. విష సర్పాలతో పాటు రక్తం పీల్చే జలగలు సైతం నీటిలో హల్‌చల్ చేస్తున్నాయి. వరద నీటిలో రెండు నిమిషాలు ఒకే చోట నిలబడితే కాళ్లకు జలగలు పట్టుకుంటున్నాయని బాధితులు చెబుతున్నారు.

నీట మునిగిన హెడ్ వాటర్ వర్క్స్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో గల డాక్టర్ కేఎల్ రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వరద నీటి ముంపునకు గురయ్యింది. నగరంలోని మూడు నియోజకవర్గాలలోని మంచి నీటి రిజర్వాయర్లకు తాగు నీరు ఇక్కడి నుంచి సరఫరా చేస్తున్న నేపథ్యంలో అందుకు ఆటంకం కలిగింది. ముఖ్యంగా హెడ్ వాటర్ వర్క్స్‌లోగల మోటార్లన్నీ నీళ్లల్లో మునిగి పోవడంతో సరఫరాకు ఇబ్బందికరంగా మారింది. నగరం జలదిగ్బంధంలో ఉండగా నీటి సరఫరా చేస్తే కలుషిత నీళ్లు కుళాయిల ద్వారా వచ్చే అవకాశం ఉన్నందున నీటి సరఫరాను నిలిపి వేశారు. మంగళవారం వరద ఉధృతి తగ్గటంతో రిజర్వాయర్లకు మంచినీటి సరఫరా ప్రారంభించారు.

కదిపితే కన్నీరే

సింగ్‌నగర్ వరద బాధితుల వేదన వర్ణనాతీతం



వరద నీటిలో నడుచుకుంటూ వచ్చి మంచి నీటి బాటిళ్లను తెచ్చుకుంటున్న మహిళ



సింగ్‌నగర్‌లోని ముంపు ప్రాంతం నుంచి బయటకు వస్తున్న ప్రజలు





ఆహార పొట్లాల కోసం ఎగబడుతున్న జనాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): 'వరద నీటితో ఇళ్లు మునిగి పోయాయి. కరెంటు లేదు.. తాగేందుకు నీళ్లు, తినేందుకు ఆహారం కూడా లేదు. మూడు రోజుల పాటు బిక్కుబిక్కుమంటూ బతికాం. ఏ ఒక్కరూ మమ్మల్ని పట్టించుకోలేదు. మా కళ్ల ముందే నీటిలో పెద్ద పెద్ద విష సర్పాలు వెళ్తుంటే వాటిని చూసి చాలా భయం వేసింది. కొద్దిగా వరద నీరు తగ్గడంతో చేతికర్ర ఊతంతో బయట పడ్డాం.. అంటూ వరద బాధితులు తమ గోడు వెళ్లబోస్తున్నారు. వరద నీటిలో నుంచి బయటకు వచ్చిన వారిని ఎవరిని కదిపినా తాము పడ్డ కష్టాలను కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నారు. 'ప్రభుత్వం హెలికాప్టర్‌లు, డ్రోన్‌లతో ఆహారం అందిస్తుందంటున్నారు. ఎవరికి ఇస్తున్నారో, ఎక్కడ అందిస్తున్నారో తెలియడం లేదు' అంటూ వాపోతున్నారు.

కర్రలే ఊతం..

వరద మంగళవారం కొంత తగ్గుముఖం పట్టడంతో అపార్ట్‌మెంట్‌లు, దూర ప్రాంతాల్లో ఉన్న వారంతా చేతికర్ర ఊతంతో వరదలో నడుచుకుంటూ బయటకు వచ్చారు. ఉదయం నుంచి వరద నుంచి బయటకు నడుచుకుంటూ వచ్చేవారితో సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ కిక్కిరిసింది. అలా నీటిలో రెండున్నర గంటల పాటు నడుచుకుంటూ వచ్చామని కొందరు, మూడు గంటలకు పైగా పట్టిందని అంటున్నారు. వృద్ధులను చేయిపట్టి నడిపిస్తూ తీసుకురాగా, చిన్నారులను తల్లిదండ్రుల తమ భుజాలపై ఎత్తుకుని తీసుకుని రావడం కనిపించింది.

వైద్యం అందక..

సింగ్‌నగర్ పైపులరోడ్డులోని తోటవారి వీధిలో నిండు గర్భిణికి మంగళవారం ఉదయం ప్రసవ నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఎంతో మందిని బోటు కోసం వేడుకున్నారు. రెండు మూడు గంటల వరకూ ఎవరూ స్పందించలేదు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె బోటు ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. అయినప్పటికీ రెండు మూడు గంటల తర్వాత కానీ వారి వద్దకు బోటు వెళ్లలేదు.



నడుములోతు నీళ్లలోనే నడుచుకుంటూ సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న ప్రజలు

పీకల్లోతు నీటిలో..

సింగ్‌నగర్ పైపులరోడ్డులోని ఓ ఇండివిడ్యువల్ హౌస్‌లో సంతోష్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్నారు. ఆదివారం ఉదయమే ఆ భవనం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం మునిగిపోయింది. సాయంత్రానికి రెండో ఫ్లోర్‌కు నీరు చేరాయి. దీంతో రెండో అంతస్తుకు వెళ్లారు. వారికి ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. తినేందుకు ఆహారం, తాగేందుకు నీళ్లు కూడా లేవు. అటుగా బోటు వెళ్తుంటే పిల్లలు ఏడుస్తున్నారని ఆదివారం సాయంత్రం బతిమిలాడారు. కానీ రాలేదు. దీంతో చేసేది లేక, పీకల్లోతు నీటిలో బయటకు వచ్చి పిల్లలకు పాలు, తాగునీరు తీసుకెళ్లారు.

ఆదుకుంటున్నారు!

బాధితులకు సాయం అందించడంపై అధికారుల అలసత్వం



పోలీసులతో గొడవపడుతున్న బాధితులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకొని.. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని.. సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులను ఆదుకోవడంలో అధికార యంత్రాంగం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది. ముంపు ప్రాంతాల్లో విధుల నిర్వహణ పేరుతో వచ్చిన అధికార యంత్రాంగంలో 75 శాతం మందికి పైగా అధికారులు, సిబ్బంది కేవలం నాయకులు, వారి ఉన్నతాధికారుల ముందు ఫొటోలకు పోజులు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో బాధితులకు బాసటగా నిలవలేకపోతున్నారు. వరద ప్రాంతాల్లో విధుల పేరుతో వచ్చిన పోలీసు, రెవెన్యూ, కార్పొరేషన్, శానిటరీ, మలేరియా, సచివాలయం అధికార యంత్రాంగంతో పాటు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సైతం కాలయాపన చేస్తూ కనిపిస్తున్నారు. కనీసం ప్రాంతా వారీగా ఇచ్చిన అధికారుల ఫోను నంబర్లు కూడా సరిగా పనిచేయడం లేదని.. ఎవరూ సమాధానం కూడా చెప్పడం లేదని బాధితులు వాపోతున్నారు.



ట్యూబుపై పిల్లలను కూర్చోబెట్టి తీసుకొస్తున్న దృశ్యం

బుడమేరుకు గండి

- ఏలూరు కాలువలోకి ప్రవహిస్తున్న వరద నీరు
- ఆందోళనలో మధురానగర్ వాసులు



ఏలూరు కాలువలోకి ప్రవహిస్తున్న బుడమేరు వరద నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు మధ్య కట్ట విజయదుర్గానగర్‌లో బుడమేరుకు మంగళవారం గండిపడింది. విజయదుర్గానగర్ రైల్వేవంతెన సమీపంలో గండిపడటంతో బుడమేరు వరదనీరు పక్కనే ఉన్న ఏలూరు కాలువలోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. రైల్వే వంతెన పక్క నుంచి వరద ప్రవాహం వేగంగా సాగుతుండటంతో మధురానగర్ వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు కాలువ నుంచి ఎక్కడ వరద తమ ప్రాంతాలలోకి వస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. గండిపడిన ప్రాంతంలో ఇళ్లు లేక పోవటం, పక్కనే ఏలూరు కాలువ ఉండటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ పెనుమత్సశిరీష సత్యం ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులకు ధైర్యం చెప్పారు

గండి వల్ల ప్రమాదం లేదు: ఎమ్మెల్యే

బుడమేరు గండి వల్ల ప్రమాదం ఏమీ ఉండదని తాము ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. విజయదుర్గానగర్‌లో బుడమేరు గండిపడిన ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. గండి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తగ్గిన బుడమేరు ఉధృతి..

బుడమేరు గండి పడటంతో గత రెండ్రోజులుగా ముంపులో ఉన్న రామకృష్ణాపురం, దేవీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాలలో వరద ఉధృతి తగ్గింది. రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు తొలగిపోవటంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. గంటకు గంటకు బుడమేరు ప్రవాహం తగ్గుతుండటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎటు చూసినా వ్యర్థాలే



చెత్తాచెదారంతో నిండిన సింగ్‌నగర్ ఫ్లై ఓవర్

పటమట(విజయవాడతూర్పు): బుడమేరు వరద తగ్గుముఖం పట్టడంతో స్థానికంగా వ్యర్థాలు పేరుకుపోవటం, కొట్టుకు వచ్చిన చెత్తాచెదారంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మరో వైపు దాతలు, ప్రభుత్వం, వీఎంసీ సరఫరా చేస్తున్న ఆహార పొట్లాలు, పాలు, సరిగ్గా పంపిణీ చేయకపోవటంతో వాటిని అక్కడే పడేస్తున్నారు. ఉదయం పాల ప్యాకెట్ల సరఫరాలో తొక్కిసలాట జరగటంతో చాలా వరకు అక్కడే ప్యాకెట్లు పగిలిపోయాయి. మరో వైపు వరద ప్రభావితంగా ఉన్న ప్రధాన ప్రాంతాలైన కండ్రిక, పాయకాపురం, పాత రాజరాజేశ్వరీపేట, రాజీవ్‌నగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాలకు ఆహార పొట్లాలు వెళ్లకపోవటంతో, వచ్చిన ఆహారం కూడా కుళ్లిపోవటంతో సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై పడేశారు. దీంతో ఫ్లై ఓవర్ అంతా బురద, ఆహార వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా ఉండటంతో విమర్శలు వస్తున్నాయి.

బాధితులకు అరకొరగా సాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాలలో బాధితులకు అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయి. ప్రభుత్వం పంపించిన పాల ప్యాకెట్లు సైతం ముంపు ప్రాంతాలలో ఉన్నవారికి కాకుండా రోడ్డుపై ఉన్న కొంత మందికి అందజేసి వెళ్లిపోతున్నారు. దీంతో నిజంగా వరద బాధితులకు న్యాయం జరగటం లేదు. ప్రభుత్వం పంపించిన పాలను ముంపులో ఉన్న, దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, బుడమేరు మధ్య కట్టవాసులు కాకుండా సమీపంలోని మధురానగర్ తదితర ప్రాంత వాసులు అందుకుంటున్నారు. తీసుకున్న వారే రెండు మూడు తీసుకుంటున్నారని కొంత మందికి అసలు పాలు దొరకక పోవటంతోచిన్నారులకు పాలు అందటంలేదని వాపోతున్నారు.అలాగే ఉచితంగా పంపిణీ చేయాల్సిన పాలను కొంత మంది దళారీలు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

అందని ఆహారం..

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ సహాయం అందని ద్రాక్ష వలే ఉంది. మంగళవారం మధ్యాహ్నం ఒక హెలికాప్టర్ 64వ డివిజన్ కండ్రిక వాటర్ ట్యాంక్‌కు సమీప ఎత్తులో ఉంటూ వరద బాధితుల కోసం ఫుడ్‌ప్యాకెట్లు ఉన్న 50 బ్యాగులను దించింది. ఆ సహాయం కోసం బాధితులు పరుగులు తీసి వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి అందిన వారు అందినట్లుగా తీసుకొని వెళ్లారు. వాటర్ ట్యాంకు మెట్లు ఎక్కలేని వారికి ప్రభుత్వ సహాయం అందలేదు. హెలికాప్టర్ ద్వారా కాకుండా పడవల ద్వారా ప్రభుత్వం సహాయం అందజేయాలని బాధితులు కోరుతున్నారు.



జీవీఆర్‌నగర్‌లో పాలప్యాకెట్‌ల కోసం క్యూలైన్

శివారు వైపు కన్నెత్తి చూడని అధికారులు



జలమయమైన సింగ్‌నగర్ లూనాసెంటర్ ప్రాంతం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లో సేవలందించేందుకు వచ్చిన అధికార యంత్రాంగం శివారు ప్రాంతాలు.. లోతట్టు ప్రదేశాలవైపు కన్నెత్తి చూడడం లేదు. గత మూడు రోజుల నుంచి వరద నీటిలో చిక్కుకొని అల్లాడిపోతుంటే కనీసం బతికి ఉన్నామా.. చచ్చామా.. అని కూడా చూసిన దిక్కులేదని ఇందిరానాయక్‌నగర్ వెనుక భాగం, అయ్యప్పస్వామి టెంపుల్ వెనుకరోడ్డు, సన్‌సిటీ కాలనీ, భారతమాత మందిరం రోడ్డు, తోటవారి వీధి, సింగ్‌నగర్ లెనిన్ సెంటర్, రామానగర్, వాంబేకాలనీ, నందమూరి నగర్, న్యూరాజరాజేశ్వరీపేట అపార్ట్‌మెంట్స్ వెనుక ప్రాంతాలు, జామతోట, అమరావతికాలనీ, సుందరమ్మదిబ్బ, అరుణోదయనగర్ ప్రాంతాల ప్రజలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వరద నీరు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ విజయవాడ సర్కిల్‌లో పనిచేసే 250 మంది సిబ్బంది కాకుండా వివిధ జిల్లాల నుంచి 594 మంది విద్యుత్ సిబ్బంది విజయవాడకు రప్పించి పనులు చేస్తున్నారు. గొల్లపూడి, భవానీపురం, వాంబేకాలనీల్లోని పరిసర ప్రాంతాల్లో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో అక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులు చేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ బీవీ.సుధాకర్ చెప్పారు. మిగిలిన విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో కూడా సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వరదల కారణంగా విజయవాడ సర్కిల్ పరిధిలో మొత్తం 12 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మునిగిపోవడం, ఇంటి మీటర్లు వరద నీటిలో ఉండటం కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశామని చెప్పారు. ప్రస్తుతం వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులు చేపట్టామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల పనితీరు ఆధారంగా..

వరద నీరు తగ్గిన ప్రాంతాలను తాము స్వయంగా పరిశీలించి ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల పనితీరును తాము స్వయంగా పరిశీలించి నిర్ధారణ చేసుకున్న తర్వాతే విద్యుత్ సరఫరా చేస్తామని సుధాకర్ చెప్పారు. వరద నీరు తగ్గని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా చేస్తే వినియోగదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందు వల్ల విద్యుత్ సరఫరా చేయడం లేదన్నారు. వరద నీరు తగ్గి, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇంటి గోడలకు అమర్చిన విద్యుత్ మీటర్లను పరిశీలించిన తర్వాతే విద్యుత్ సరఫరాను చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

6న వ్యాయామ అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి వ్యాయామ అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టు ఇంటర్వ్యూ ఈనెల 6వ తేదీకి వాయిదా వేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఇంటర్వ్యూను 6వ తేదీ ఉదయం 11 గంటలకు మార్చామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని ఆమె కోరారు.

వరద బాధితులకు తాగునీటి సరఫరా

పాయకాపురం(విజయవాడరూరల్): చుట్టూ నీరే ఉన్నా.. తాగేందుకు గుక్కెడు నీరు లేని పరిస్థితిలో వరద బాధితులున్నారు. గత మూడు రోజులుగా వరదల్లో చిక్కుకున్న కండ్రిక, పాత పాయకాపురం, వాంబే కాలనీల్లోని వరద బాధితులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నున్న గ్రామానికి చెందిన భీమవరపు శివరామిరెడ్డి, భీమవరపు నరేంద్ర మంగళవారం స్వచ్ఛందంగా తాగునీరు సరఫరా చేశారు. నున్న గ్రామం నుంచి ప్రత్యేకంగా 12 వాటర్ ట్యాంకులు(సుమారు 50వేల లీటర్లు) తీసుకొచ్చి తాగునీటి కోసం ఎదురు చూస్తున్న బాధితుల దాహం తీర్చారు. అలాగే నున్న గ్రామంలోని పలువురు దాతలు వరద బాధితుల కోసం భోజనాలు సిద్ధం చేసి ట్రాక్టర్లపై తీసుకొస్తున్నారు. వరదల్లో అన్నం కోసం ఎదురు చేసే బాధితులు భోజనం తీసుకొస్తున్న దాతృత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ స్వీకరిస్తున్నారు.



ట్యాంక్ ద్వారా తాగునీరు పట్టుకొంటున్న బాధితులు

దొంగల హల్‌చల్

విజయవాడస్పోర్ట్స్: వరద నీటిలో కొట్టుమిట్టాడుతున్న బుడమేరు బాధితులను దొంగలు టార్గెట్ చేశారు. సోమ, మంగళవారాల్లో ఆయా ప్రాంతాల నుంచి ఎంతో మంది బాధితులు వారివారి ఇళ్లను వదిలేసి ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఒడ్డుకు చేరారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. మంగళవారం సాయంత్రం వరద ప్రభావం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో బాధితులు వారివారి ఇళ్లను చూసుకునేందుకు వెళ్లి.. ఇల్లు చోరీకి గురైందని తెలుసుకుని బావురుమంటున్నారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై పులిహోర, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసే వాహనాల వద్ద బాధితులు ఎగబడుతున్న విషయం తెలిసిందే. గుంపులో గోవింద అన్నట్లు అక్కడా బాధితుల పర్సు, సెల్‌ఫోన్‌లను తస్కరిస్తున్నారు.

ఆపదవేళ ఆపన్నహస్తం

వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థల సాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులు బాబా మందిర సేవలను సద్వినియోగం చేసుకోవాలని, వరద ముంపు తగ్గే వరకు ఆహారం అందిస్తామని ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి అన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో మంగళవారం వరదబాధితులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వరద బాధితులకు భోజనాలు వడ్డించారు.



భోజనాలు వడ్డిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

- ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో మంగళవారం వరద బాధితులకు స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష భోజనాలు వడ్డించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పెనుమత్స సత్యం పాల్గొన్నారు.
- బుడమేరు వంతెన సెంటర్, ముత్యాలంపాడు ప్రాంతాలలో శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన వరద బాధితులకు తాగు నీరు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంకటేశ్వరరాజు, కె. ప్రసాదరాజు, కోశాధికారి రాజు పాల్గొన్నారు.
- దావుబుచ్చయ్యకాలనీ శ్రీశ్యామలాంబదేవి దేవాలయం ధర్మకర్త చింతపల్లి కనకారావు ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు.
- బుడమేరు వరద ముంపు ప్రాంతాలలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన వరద బాధితులకు ఆహారం, తాగునీరు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా, జిల్లా గవర్నర్ కొత్త గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.
- వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దేవీనగర్, రామకృష్ణాపురం తదితర ప్రాంతాలలో వరద బాధితులకు ఆహార పొట్లాలుఅందజేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.
- విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం తుపాను ప్రభావిత ప్రాంతాలలో ఆహార పొట్లాలు, బ్రెడ్, మంచినీటి ప్యాకెట్లను పలు ప్రాంతాలలో పంపిణీ చేశారు. విపత్తు సమయంలో ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో కార్యక్రమాలకు రూప కల్పన చేసినట్లు వివరించారు. ప్రభల శ్రీనివాస్, కిరణ్, చలపతిరావు, కిరణ్ సహకరించారన్నారు.
- మధురానగర్: వరద ముంపునకు గురైన బసవతారక నగర్, శాంతినగర్‌లో సీపీఐ 32వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి డీబీకేరావు, నాయకులు డి. సీతారావమ్మ, చిరుతోటి శ్రీధర్, పత్తిపాటి రాజు, రాజ్యలక్ష్మి, బుజ్జి, రాహేలమ్మ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలంపాడులో భోజనాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష



32వ డివిజన్‌లో ఆహార పొట్లాల పంపిణీ చేస్తున్న నాయకులు

- కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితులకు ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ముత్యాలంపాడు ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద స్థానికంగా నివాసం ఉంటున్న ఓ కుటుంబసభ్యులు అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న బాధితులకు వేడివేడి సమోసాలు పంపిణీ చేశారు.
- విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఉద్యోగులు వరద బాధితుల సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఫ్లై ఓవర్ వద్దకు చేరుకుంటున్న వరద బాధితులకు పండ్లు, ఆహారాన్ని అందజేస్తున్నారు. డీఎస్డీవో అజీజ్, కోచ్‌లు పాల్గొన్నారు.
- పటమట(విజయవాడతూర్పు): విజయవాడకు చెందిన ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులకు మంగళవారం 10 వేల ఆహార పొట్లాలను రెడ్ క్రాస్ ఆఫీస్‌కు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందించామని అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, కార్యదర్శి రావి శరత్ బాబు తెలిపారు.



ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కళాపీఠం ప్రతినిధులు



వరద బాధితులకు సమోసాలు పంపిణీ చేస్తున్న దాతలు